పిచ్చుకగూళ్ళు

వేమకోటి సీతారామశాస్త్రి

"ఈ పద్ధతేం బాగులేదండి," అంది రాజ్యం ఉదయాన్నే భర్తకు కాఫీ యిస్తూ. గిరేం ఆశ్చర్యపోలేదు. ఆమె చెప్పదల్చుకున్నదాని మీద అప్పుడే గత నెలరోజులుగా తర్జనభర్జనలు జరుగుతున్నాయి.

"అయితే యేం చేద్దామంటావు?" భార్య మాటలకు చిరాకేసి అడిగాడు.

"యెవర్నో కూలివాడ్ని పెట్టి తీయించేస్తే సరి," అంది పట్టుదలగా.

"పోనీ నువ్వే ప్రయత్నించు యెవర్నైనా కూలివాడ్ని," అన్నాడు నవ్వి.

"నేను వొకరిద్దర్ని ప్రయత్నించాను. కానీ కుదరలేదు. యెక్కువ డబ్బిస్తామన్నా చెయ్యమనేసారు." అంది రాజ్యం

"నిజంగా వాళ్ళు దేవుడికన్నా గొప్పవారే .."

"ఆపండి మీ పొగడ్తలు. చూడండి యింకా తెల్లవారిందో లేదో యెంత తొక్కూ పోగడిందో," అంది పెచ్చు

లూడిన గచ్చువేపు చూస్తూ. గత రాత్రి వర్షానికి గది కారి గచ్చు చెమ్మగావుంది. గిరి కూడా చూసాడు. నిజమే!

అదే సమయానికి పిచ్చుకలు రెండు కిటికీలోనుండి గడ్డిపోచల్ని ముక్కున కరచుకొని గదిలో దూలం సందులోకి దూరాయి.

గిరి గుమస్తా వుద్యోగం చేస్తున్నాడు. అద్దెయింట్లో నే చాలా కాలంగా వుంటున్నాడు. చాలా పాత యిల్లు అది. ముందు వొకగది. వంటిల్లు. వర్షం వస్తే కారుతుంది. 'సూర్యచంద్రులు ప్రత్యక్ష మవుతున్నారమ్మా కాస్త బాగుచేయించు' అంటే, యింటిగలామె వినదు. అలాగ యినా వారు ఖాళీ చేస్తే, అద్దె పెంచి యింకొకరికి యివ్వవచ్చని ఆమె ఆలోచన. ఉద్యోగంకన్నా యిల్లు దొరకటం కష్టమయి పోతున్నది ఆ పట్టణంలో. అందుకనేయెలాగోసర్దుకు పోవటం నేర్చుకున్నారు, ఆ దంపతులు యిద్దరి పిల్లలతో.

ముందు గది అంత పెద్దది కాకపోయినా, అదే వాళ్ళకు బెడ్‌రూమ్, రీడింగ్ రూమ్ వగైరా.... వగైరా .. వున్న వొక మంచం వర్షం వచ్చినా కురవని చోట వొకమూలగా అమర్చింది. అంతేకాక పిల్లల పుస్తకాలు, బట్టల దండెం, మాసిన బట్టల బుట్ట, కోడువిరిగి పోయిన కుర్చీ, పొట్టి స్టూలు యివన్నీ పొందికగా అమర్చింది, రాజ్యం. కానీ నెల రోజులుగా కొత్త బెడద వచ్చి పడింది.

మంచానికి మీదనే దూలం వుంటే, ఆ సందులో రెండు పిచ్చుకలు గడ్డి పోచలూ, చెత్తా చెదారంతో గూడు కట్టు కుంటున్నాయి. ఆ సందర్భంలో చెత్తా చెదారం, అంతా మంచంమీదనూ, గాలి కెగిరి గచ్చుమీదనూ పడి గలీజుగా తయారవుతున్నది గది. రాజ్యంకు యేమీ పాలుపోలేదు. యెలా మార్చినా, మంచం మీద పడక తప్పదు. సర్వులో వుతికిన తెల్లదుప్పటి అసహ్యంగా తయారవు తోంది. పిల్లలు ఉదయం, మధ్యాహ్నం పిచ్చుకలు ఎగరటం, అవి చేస్తున్న పనులు చూడటం తప్ప చదవటం మానేసారు. పిచ్చుకలకు పిడికెళ్ళతో బియ్యం, కిటికీ అంచున వేస్తున్నారు. అవి ముక్కున కరచుకొని తినటం వాళ్ళకి వినోదంగా వుంది. రాజ్యంకు యిల్లు యేమాత్రం అపరిశుభ్రంగావున్నా సహించదు. అవి రాలుస్తున్న చెత్తా చెదారాన్ని తుడవలేక విసిగెత్తి పోతున్నది రాజ్యం.

అందుకనే భర్తతో ఉదయం గట్టిగానే చెప్పింది. పిచ్చుకల కివేమీ పట్టనట్లుగా వాటి భాషలో అరచుకుంటున్నాయి.

"వొకపని చేద్దాం రాజ్యం," అన్నాడు కాఫీ త్రాగి కప్పు పక్కన పెడుతూ. రాజ్యం ఆశతో భర్తవేపు చూసింది, యేమిటన్నట్లుగా.

"తొందరగా యిల్లు మార్చేద్దాం," అన్నాడు సీరియస్‌గా.

"త ల పా గా చుట్టలేక తలవంక రన్నారట వెనకటికొకరు అలా వుంది మీ ఆలోచన ." అంది కోపంగా.

"దేశంలో యెంతమంది. పేవ్‌మెంట్ల మీద, చెట్లకింద, మురికిపేటల్లోనూ, మేడల నీడలకింద, యెండకు యెండుతూ చలికి వణుకుతూ యెంత నికృష్టంగా బ్రతుకుతున్నారో! యెవ్వరూ వీళ్ళకి ఆశ్రయ మివ్వటంలేదు. మనలాంటి దిగువ మాధ్యమిక తరగతి వాళ్ళం, సానుభూతి తప్ప మరేసహాయం చేయలేం వాళ్ళకి. మనవి చాలీ చాలని బ్రతుకులు. కానీ ఆ రెండు పిచ్చుకలకు మనం ఆ మాత్రం ఆశ్రయం, అంటే, మనం నివసించే యింట్లో దూలంమీద జానెడు చోటుయివ్వలేమా ఆలోచించు,"అన్నాడు షేవింగుసెట్టు నుండి బ్లేడు బయటకు తీస్తూ.

మరి మాట్లాడలేకపోయింది రాజ్యం. భర్తకెంత చెప్పినా చెవిటి వాడి ముందు శంఖం వూదినట్లే. ఆమె మనస్సు శూన్యమైపోయింది.

భర్తని ఆఫీసుకు, పిల్లల్ని బడికి పంపించిన తరువాత ముందుగదిలో కాస్త సేపు నడుం చేరవేసింది. పిచ్చుకలు తుర్రుమని చప్పుడుచేసుకుంటూ ఎగిరే శబ్దాలు, అవి పొరపాటున గూడు కట్టుకోబోయి జారవిడిచే గడ్డిపోచలూ రాజ్యానికి నిద్రపట్టనివ్వలేదు. యెక్కడా యిళ్లులేనట్లు ఈ యింట్లోనే కట్టుకోవాలా! దరిద్రం పక్షులు. పట్టరాని కోపంతో అదిలించింది. కిటికీ తలుపులు వేసింది. కానీ పుచ్చిపోయిన ఆ కిటికీ తొర్ర లోంచి పిచ్చుకలు రావటం ఆపలేక పోయింది. యింక భరించలేకపోయింది వాటి చర్యలని రాజ్యం.

సాయంకాలం పిల్లలు రవీ, శాంతి స్కూలునుండి వచ్చిన తరువాత కాఫీలు యిచ్చి వాళ్ళని ఆటకి పంపించేసి, పొరుగింటి వాళ్ళింట్లో నుండి నిచ్చెన తెచ్చింది. యింకా ఎండ కరిగిపోలేదు. పిచ్చుకల అలికిడి కన్పించలేదు. నెమ్మదిగా దూలంకు చేరవేసింది నిచ్చెన.

'ఈ రోజుతో పీడా విరిగిపోతుందీ పిచ్చుకల బెడద,' అని అనుకుంటూ దూలంలోకి తొంగి చూచింది, చెయ్యి పెట్టబోయి. అంతే! షాక్ తిన్నట్లుగా చెయ్యి వెనక్కు తీసేసుకుంది. అందులో పచ్చని మాంసం ముద్దల్లా పిచ్చుకపిల్లలు పీలగా అరుస్తున్నాయి. ఆమెకు తన పిల్లలు పొత్తిళ్ళలో వుండే దృశ్యాలు జ్ఞాపకం వచ్చాయి. మాతృహృదయం యెక్కడో కలుక్కుమంది. మెట్లుయెలా దిగిందో రాజ్యానికి గుర్తులేదు. యింతలో కూతురు శాంతి యేడుస్తూ గదిలోకి వచ్చింది.

"యేమమ్మా యేడుస్తున్నావ్?" అడిగింది రాజ్యం స్పృహలోకి వచ్చి.

"మరేనమ్మా నేను ఇసుకతో పిచ్చికగూడు కట్టుకుంటే, అన్నయ్య వాళ్ళు కాలుతో మట్టేశారమ్మా," అంది. కిటికీలో నుండి చూసింది రాజ్యం. యెదురింటివాళ్ళు పెద్ద భవనం కడుతున్నారు. దాని కోసం పోసిన యిసక దిబ్బల మీద పగిలిపోయిన యిసకగూళ్ళు కనిపిస్తున్నాయి.

"నేను కొప్పడుతాలే తల్లీ నువ్వు పోయి చదువుకో" అంటూ, విచ్చెన యివ్వడానికి పొరుగింటికి వెళ్ళింది.

* * *

ఆదివారం గిరికి శలవురోజు రాజ్యం ప్రవర్తనలో కొంచెంమార్పు కనిపించింది గిరికి. రోజూ వేసే పిచ్చుకలమీద గ్రామఫోన్ రికార్డు వేయలేదు పైగా తనే స్వయంగా బియ్యం తెచ్చి కిటికీ అంచున వేసింది మౌనంగా గమనిస్తున్నాడు గిరి

"యేమిటి రాజ్యం? నీలో యివాళ వింత మార్పు కనిపిస్తోంది," అన్నాడు మధ్యాహ్నం ముందు గదిలో రెస్ట్ తీసుకుంటూ. తమలపాకులకు సున్నం రాస్తున్న రాజ్యం కళ్ళలో నీరు తిరిగింది గుండె చిక్కబట్టుకుని ముందు రోజు జరిగిన సంఘటన చెప్పింది

"పోనీలే రాజ్యం, నీలో యిలాంటి పరివర్తన కలిగినందుకు నాకు చాలా సంతోషం వేస్తున్నది," అంటూ మంచం మీద దిండు క్రిందకు తెచ్చుకుని పడుకుని దూరం వేపు చూసాడు. పిచ్చుకలు గూడుకట్టడంలో లీనమైపోయి వున్నాయి. రాజ్యం గూడా గిరి ప్రక్కనే నడుం వాల్చింది ఆమెకు గూడా అదే దృశ్యం కన్పించింది మరో ఐదు నిమిషాలు గడిచాయి మధ్యాహ్నపు యెండ, మంచ మీద ఏటవాలుగా పడుతోంది కిటికీ గుండా.

"రాజ్యం, నిద్ర పోతున్నావా?" అడిగాడు.

"లేదండి," అని భర్తవేపు తిరిగింది.

"యీ మానవ జన్మంత నికృష్టమైన జన్మ మరొకటి లేదు." అన్నాడు

"అదేమిటండీ! అలాగంటారు. పూర్వ జన్మలో యెంతో పుణ్యం చేసుకుంటేగానీ మానవజన్మ లభించదంటారు మీరేమో " అర్ధోక్తిలో ఆగిపోయింది

"యేం పుణ్యమో చూడా పక్షుల్ని స్వేచ్ఛగా తినడానికి మాత్రం ఆహారం సంపాదించుకుంటున్నాయి. నిరంతర కృషితో వాటి కొరకు గూడు నిర్మించుకుంటున్నాయి వాటిలో అంతస్థులభేదాలు లేవు కీచులాటలు లేవు. సంఘర్షణలు లేవు కానీ మరి మన మానవజీవితాలలో బ్రతికినంతకాలం తిండికీ, గుడ్డకు, గూడుకీ కాకుండా, ప్రతి చిన్నవిషయానికి ఆరాటం, పోరాటం తప్పదు "

"మరి యిదేనండి సృష్టి విచిత్రం " అంది పెద్ద ఆరిందలా రాజ్యం

"సృష్టి విచిత్రం కాదు. స్వార్థమానవ సమాజం వాళ్ళకోసం నిర్మించుకుంటున్న స్వర్గం" అన్నాడు కోపంగా

"తను సుఖపడాలని కోరుకోవటం తప్పాండీ," అంది అమాయకంగా

"తప్పులేదు కానీ యెలా! యితరులను దోపిడీ చేసా? అవసరాలకు మించి యెక్కువ ఆదాచేయటం, ఆకాశాల్నంటే అంతస్థుల భవనాలు, అర్థం పర్థం లేకుండా కట్టుకోవటం, యిన్ని చేసినా ఆ వ్యక్తి ప్రాణాలు పోతున్నపుడు బయట కీడ్చేస్తారు నిర్దాక్షిణ్యంగా" అన్నాడు ఆవేశంగా

"పోన్లెద్దురూ! యింతకీ వాట్లో భర్త ఎవరు? భార్య ఎవరు?" అడిగింది సంభాషణ మార్చాలన్న ఉద్దేశ్యంతో మంచంమీద సూర్యకిరణాలు పడుతున్నాయి. వాటిమీద పిచ్చుకలు గెంతుతూ మళ్లా తుర్రుమని దూలం మీదకు ఎగిరిపోతున్నాయి

"యిప్పుడు చూడు," అన్నాడు. రాజ్యం కళ్లింతలు చేసుకుని వాటికేసి చూసింది అవి రెండూ సరాగాలాడుకుంటున్నాయి సిగ్గుతో భర్త వక్షస్థలం మీద వాలిపోయింది రాజ్యం

"చూసావా! సృష్టి రహస్యానికి ప్రాణం పోస్తున్నా యవి," అన్నాడు ఆమె నుదురు ముద్దుపెట్టుకుంటూ

"యేమండీ! మనం గూడా యిల్లు కట్టుకుంటే," అతని గాఢ పరిష్వంగం నుండి విడిపించుకుంటూ.

"మనమా! యిల్లా " నవ్వేశాడు. ఆశ్చర్యంగా చూసింది రాజ్యం.

"ఈ పిల్ల లిద్దరికే యింత కడుపు నిండా తిండిపెట్టి వాళ్ల జీవితానికో దారి చూపించగలిగితే" అన్నాడు నిరుత్సాహంగా.

"నిజమేనండి! పోనీ నే నేదయినా ఉద్యోగం చేద్దామంటే మా నాన్న నాకు అట్టే ఎక్కువ చదువు చెప్పించలేదు," అంది నిరుత్సాహంగా

"నాకు తెలిసినంతవరకూ మా వంశంలో యెవ్వరూ స్వంతయిల్లు కట్టుకుని వున్నట్లు మా నాన్న చెప్పలేదు. మా చిన్నప్పుడు ఒక అద్దె యింట్లో వుండేవాళ్లం అదొక రెక్క పడి విరిగిపోయిన యిల్లు. అందులోనే మా నాన్న రిటైరయ్యాడు. తర్వాత నెలలోనే చచ్చిపోతే, ఆ యిల్లుగల ఆసామీ, యింట్లో వున్న చెంబూ, గిన్నె, విలువ యివ వస్తువులూ తీసుకొని నన్నూ, అమ్మనీ కురుస్తున్న వర్షంలో గెంటేసాడు," అన్నాడు. అతని కళ్లు చెమర్చాయి

మళ్ళా పిచ్చుకలు తుర్రుమన్నాయి. మరో క్షణంలో ముక్కున గడ్డిపోచలు కరచుకుని గూడుకు చేరుకున్నాయి వాటి ప్రయత్నంలో యేదో సందేశం మెరుపులా గిరి మస్తిష్కంలో మెరిసింది మళ్లా రెండు పిచ్చుకలు బయటి కెళ్ళిపోయాయి

"నువ్వు చెప్పింది గూడా నిజమే రాజ్యం మనం స్వంతంగా యిల్లు కట్టుకుందాం," అన్నాడు లేచి కూర్చుని.

భర్త మాటలకు ఆశ్చర్యపోలేదు. గిరి పట్టుదల ఆమెకు తెలుసు ఆమెలో కాంతి రేఖలు తళుక్కుమన్నాయి

"మనం యెలాంటి యిల్లు కట్టుకుందామంటారు," అడిగింది

ఒక చిన్న యిల్లు" రెండుచేతులతో అభినయించి చెప్పాడు, వంగుని ఆమె రెండు చెంపల్నీ తాకుతూ

కిటికీ తలుపు రెక్కమీద పిచ్చుక వూరికే రొద చేస్తోంది ఆరాటపడిపోతున్నది అటూ, ఇటూ చూస్తోంది

"యెందుకండీ అది అలా గోలపెడుతోంది," అడిగింది పిచ్చుకల్ని పోల్చడం చెప్పాడు, యిదివరకే భార్యకు

"యేంలేదు దాని భర్త యెక్కడికో వెళ్లి యింకా రాలేదు అందుకని అలా అరుస్తోంది," అన్నాడు నిజమే మరి కొంతసేపయిన తరువాత మగపిచ్చిక వచ్చేసింది అప్పుడు అది అరవడం మానేసింది

"యెలా తెలిసిందండీ" అడిగింది, ఆశ్చర్యపోయి రాజ్యం

"నేను పిచ్చుకల భాష నేర్చుకున్నాను," అన్నాడు నవ్వి

* * *

రోజులు గడుస్తున్నాయి. పూర్వంలా తొక్కపడుతున్నా విసుక్కోవటం మానేసింది, రాజ్యం. మధ్యాహ్నం తీరిక సమయాల్లో ఆ గూటివేపు చూడటం పరిపాటి అయిపోయింది ఆమె కళ్ళల్లో భర్త కట్టబోయే చిన్న యిల్లు లీలామాత్రంగా గోచరించేది.

గిరి ఆఫీసులో పి యఫ్ లోను పెట్టి చిన్న జాగా కొన్నాడు రాజ్యం పిల్లలకు పొద్దున కాఫీ యివ్వటం మానేసింది. పాల వాడకం తగ్గించేసింది. పనిమనిషిని మానిపించేసింది యేవో అవసరమైన బట్టలు తప్పించి మిగతావి వుతుక్కోవటం మొదలుపెట్టింది సినిమాలు మానేసింది యెంత పొదుపు పాటించాల్సిన అవసరం వుందో అంతకన్నా యెక్కువ పాటిస్తోంది గిరి పరిస్థితీ అలాగే వుంది వొక దుకాణంలో పద్దులు రాయటం, తర్వాత రెండు ప్రయివేట్లు చెప్పటం మొదలుపెట్టాడు ఉదయంపూట గూడా మరి రెండు ప్రయివేట్లు చెప్పడానికి గూడా కుదుర్చుకున్నాడు

ఆ సాయంకాలం రాజ్యం డబ్బు లెఖ్ఖపెట్టుకుంటోంది గిరి హుషారుగా వచ్చాడు

"యిదిగో రాజ్యం! యింటికి ప్లాను వేయించాను, చూడు," అని మంచంమీద పరిచాడు రాజ్యం ఆతృతగా చూసింది. ఆ గీతలు ఆమెకు సమంగా అర్థంకాలేదు

"యిది వరండా, యిది డ్రాయింగ్

రూమ్, యిది వంటిల్లు వరండా ముందు చిన్న గార్డెనుకు స్థలం. బాగుందా!" ఆమె ముఖంలోకి చూస్తూ అడిగాడు రాజ్యం పెదవి విరిచింది

"యిదేమిటింత చిన్న గదులు, మరి చుట్టాలు, స్నేహితులూ వస్తే వారికో గది వేరేగా వుండొద్దండీ," అడిగింది

"మరి అవుట్ హౌస్ అఖ్కర్లేదా డాబామీద గది అఖ్కర్లేదా," అన్నాడు హాస్యంగా.

"సరే, మీ యిష్టం యింతకీ యింటి ముందు జాగాలో యేం వేద్దామంటారు"

"సంపెంగ మొక్కలు నాటవాం," అన్నాడు వుత్సాహంగా. సంపెంగలు అంటే యెంతో యిష్టం

"అమ్మ బాబోయ్ వద్దండీ సంపెంగ నాగులు వస్తాయంటారు మరి మనం శుభ్రంగా మల్లె మొక్కలు, సన్నజాజి తీగలు నాటుకుందాం," అని సలహా యిచ్చింది

"సర్లే నీ యిష్టం" గిరికి తెలుసు. భార్యకి మల్లెలూ, సన్నజాజులూ అంటే చాలా యిష్టమని

"మీకో శుభవార్త చెప్పనా"

"యేమిటది?"

"ఈ నెల మనం ఆదా చేసినది సుమారు తొంభైరూపాయలు అయింది," అంది వుత్సాహంగా.

"అంటే సంవత్సరానికి సుమారు వెయ్యి అన్నమాట. ఈ లెఖ్కన మనం యిల్లు కట్టాలంటే పది సంవత్సరాలు ఆగాల్సి వస్తుంది," అన్నాడు నీరసంగా.

"యేమిటి పదివేలా!" అడిగింది.

"అవును. జాగా ఖరీదు కాక తాటి

కమ్మల కప్పు వేయిస్తే అవుతుంది అదీ యివాళ్టి రేటును బట్టి," అన్నాడు

"ఈ పది సంవత్సరాలలోనూ ప్రమోషను రాదా!"

"యెందుకు రాదూ! ప్రమోషను వస్తుంది. పిల్లల చదువులూ పెరుగుతాయి," అన్నాడు

"మీకన్నా ఆలస్యంగా జాయినయిన వాళ్లు యెలా కట్టగలుగుతున్నారండీ" అంది ఆశ్చర్యంగా వారం రోజుల క్రితమే భర్త ఆఫీసులో పనిచేసే గుమాస్తా గృహప్రవేశ మహోత్సవానికి ఆమె గూడా వెళ్లింది ఆ పేరంటంలో ఆ భార్యాభర్తలిద్దరూ సిల్వరుచెంబు, తపేలాతో ఆ వూరు వచ్చి గడించారని అమ్మలక్కలు చెవులు కొరుక్కోగా వింది

"అక్రమ అర్జనతో వొకళ్ళను పీడించి వాళ్ల వుసురుపోసుకుని సంపాదించిన డబ్బుతో తాత్కాలికంగా మనం యేదో తృప్తి సంపాదించుకున్నా, అది నాగై మన పిల్లల భవిష్యత్తుమీద యేదో విధంగా దెబ్బతీయక తప్పదు. నీకు తెలుసు నేను లంచం పుచ్చుకోనని, నా రెక్కల కష్టంమీదనే, మనం పిచ్చుక గూడు నిర్మించుకుందాం," అన్నాడు భార్యతో అనునయంగా

మరో నెలరోజులు గడిచేసరికి, రాజ్యం సుమారు నూటపాతిక రూపాయలకు పైగా ఆదా చేయగలిగింది. అర్ధరాత్రపుడు రాజ్యంకు వొక్కొక్కప్పుడు తెలివి వచ్చి చూస్తే గిరి యింటికి తీసుకు వచ్చి రాస్తున్న రెండుమూడు దుకాణాల పద్దులు కన్పించేవి. కాస్త వేడి టీ గూడా కాచి యిచ్చేది. భర్తకి తోడుగా తనూ కాస్సేపు ఆ ప్లానును ముందేసుకొని కట్టబోయే యింటిని ఉత్సాహంగా చూసేది ఒక్కొక్కసారి భార్యాభర్తలిద్దరూ ముందు నెలలో మరికొంత యెక్కువ ఆదా చెయ్యడానికి మార్గాలు ఆలోచించేవారు, అర్ధరాత్రి యెంతో శ్రద్ధగా.

* * *

మధ్యాహ్నం వొంటిగంట దాటింది. ఆ రోజు ఎండ నిప్పులు చెరుగుతోంది. గదిలో రాజ్యం నిద్రపట్టక పిచ్చుకగూటి వేపు చూసింది అది బాగా తయారయింది చూడముచ్చటగా వుంది. అంత చక్కగా శ్రమించి తామూ యిల్లు కట్టుకోవాలి. ఆ యింట్లో యీ పిచ్చుకగూడు పిచ్చుకల్ని ఫోటో తీయించి పెట్టుకోవాలి. వీలయితే వాటిని అక్కడికే తరలించాలి యిలా ఆలోచనలు ఆమె మనస్సు చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

యింతలో వీధిలో యేదో కలకలం వినిపించింది కిటికీలోనుండి చూస్తే, యింటిముందు అంబులెన్సు ఆగింది. వొక మనిషిని మోసుకుని వీధిగుమ్మంలో వుంచారు. అతనిమీద తెల్లగుడ్డ కప్పి వుంది రాజ్యం గాభరాగా తలుపులు తెరిచింది. అంబులెన్సు వెనుక గిరి ఆఫీసు స్టాఫంతావున్నారు. భయంతోనే తెల్లగుడ్డ

తొలగించింది అంతే। కెవ్వునకేకవేసింది గిరి నల్లగా మాడిపోయివున్నాడు

"లంచవర్లో కాఫీకి వెడుతుండగా రిక్షావాళ్ళ గుడిసెలు అంటుకోవటం చూసి, వాటిని ఆర్పి వొక గుడిసెలో, పిల్లల్ని, రోగంతో మూలుగుతున్న రిక్షావాడ్ని బయటకు తీసి రక్షించాడు కానీ తను బ్రతకలేకపోయాడు. అప్పటికే వొళ్లు కాలిపోయింది," అన్నాడు, ఆఫీసు స్టాపులో ఒక గుమస్తా

"ఆ బాబు రుణం తీరుసుకోలేం తల్లీ నా గూట్లో దీపం ఆరిపోకుండా యెలిగించాడు,"అంది యేడుస్తూ వొక స్త్రీ

యెవ్వరి మాటలు విన్పించలేదు రాజ్యానికి

జరగవలసిన కార్యక్రమం జరిగి పోయింది

కాలం యెవరికోసం ఆగుతుంది నెల రోజులు గడిచాయి యెక్కడికి వెళ్ళడానికి యెవ్వరూ లేరు, రాజ్యానికి. ఆదరించడానికి అత్మబంధువులు లేరు, గిరి ఆఫీసులో స్నేహితులు తప్ప

వొకనాటిసాయంకాలం, ఆఫీసుస్టాఫ్, ఆఫీసరుగారు యింటికి వచ్చారు

"అమ్మా, నీ భర్తకు రావలసిన గ్రాట్యుటీ పదివేలు, యిదికాక నెలకు సుమారు నూటయాభైకి పైగా పెన్షన్ రావచ్చు " అంటూ డబ్బు మంచం మీద పెట్టాడు.

"చాలా మంచివాడమ్మా గిరి. అతన్ని పోగొట్టుకుని మేమెంత బాధ పడుతున్నామో తల్లీ ఈ డబ్బుతో చిన్న యిల్లు కట్టుకుని వచ్చిన పెన్షను డబ్బుతో పిల్లల్ని చదివించి పెంచి పెద్దచేయి నువ్వు కూడా ఆపేసిన చదువు పూర్తిచేయి అప్పుడు నీకు డిపార్టుమెంటు వుద్యోగం యిస్తుంది," అన్నాడు ముసలి మేనేజర్ ఆమెను వోదారుస్తూ

సూర్యుడు అస్తమించాడు అయినా వెలుగింకా మాయలేదు దుఃఖంతో కుములుతున్న రాజ్యం తెప్పరిల్లుకుని వర్తమానంలోకివచ్చింది పైకిచూచింది.

పిచ్చుకలు రెండూ నిశ్శబ్దంగా కూర్చుని, ఆమెలో చెలరేగిన అశాంతికి సానుభూతి నందజేస్తున్నట్లుగా వున్నాయి

మంచంమీద నోట్లకట్టల్ని చూసింది రాజ్యం యే పదివేల రూపాయలు కూడబెట్టి గూడు కట్టుకుందా మనుకొని, తన భర్త అహోరాత్రాలూ శ్రమించాడో, ఆ డబ్బు అతను మరణించాక లభించింది జీవితానికీ, బ్రతుక్కీ, ఆశలకీ, ఆశయాలకీ, ఆత్మీయతలకు, అనుబంధాలకీ, ప్రేమకూ వుండే ఆశ్రయాలు పిచ్చిక గూళ్ళ లాంటివి

కిటికీలో నుండి చూస్తే పిల్లలిద్దరూ నిర్విచారంగా యిసుకలో పిచ్చుకగూళ్లు కట్టుకుని ఆడుకుంటున్నారు స్థిర నిర్ణయంతోనే డబ్బు చేతిలోకి తీసుకుని అప్రయత్నంగా పిచ్చుకగూటి వేపు చూసింది రాజ్యం